# జడ్జిమెంట్

రచన;
(శ్రీ) బట్టేపాటి చిట్టిబాబు చౌదరి

జడ్జి కోర్టు జనంతో కిటకిటలాడుతోంది. జడ్జిగారు 'ఆర్డర్...ఆర్డర్' అంటూ ఐదు నిముషాలకో సారి బల్ల గుద్దుతున్నాడు. ఆ జనంలో కాలేజి కుర్రాళ్ళే ఎక్కువగా వున్నారు. ఒకవైపు బోనులో సుధాకర్ నిలబడున్నాడు. రెండోవైపు హైమావతి వుంది. కోర్టు గడియారం పదిన్నర కొట్టింది. ప్రాసిక్యూటర్ తన వాదాన్ని చదివి వినిపించాడు. లాయర్ శేషాచలం సుధాకర్‌ని క్రాస్ పరీక్ష ప్రారంభించాడు.

'వాది హైమావతి నీనుంచి విడాకులు కోరుతుంది. నీకు సమ్మతమా?'

'కారణం!'

'మీరు పశుతత్వంతో ఆవిడను హీనంగా చూస్తున్నారు'

'ఏ విషయంలో'

'అన్ని విషయాలలో'

'నేనంగీకరించను. రుజువు కావాలి'

'వాది తన పిటీషన్‌తో కారణాలు పేర్కొంది. ఆ కారణాలు మీకు వినిపించారు'

ఇలా సాగింది వాదం. గడియారం పన్నెండు కొట్టింది. కేసు మర్నాటికి వాయిదా వేశారు. బోనులోంచి దిగబోయే ముందు సుధాకర్ ఒక్కసారి సూటిగా హైమావతి ముఖంలోకి చూశాడు. ఆమెకూడ తీక్షణంగా సూటిగా తనవైపే చూస్తోంది. ఆ యిద్దరి చూపులకు సతమతమవుతున్నారు గాలరీలోని ప్రేక్షకులు. కాసేపటికి తన లాయర్ పలకరింపుతో బయటికి నడచింది హైమావతి. సుధాకర్ గాలరీలోని జనంవైపు ఒకసారి చూసి భారంగా నిట్టూర్చి బయటకు నడిచాడు. బయట వేపచెట్టుమీదున్న కాకుల జంట పోట్లాడుకుని ఉత్తర, దక్షిణాలను సూచిస్తూ ఎగిరిపోయాయి.

× × ×

సుధాకర్ ఇంటికి వచ్చాడు. భోంచేయడానికి మనసు పోలేదు. వాలు కుర్చీలో నడుం వాల్చాడు. ఆలోచిస్తున్నాడు. గత విషయాలు నెమరువేసుకుంటున్నాడు. కాలచక్రం వెనక్కు తిరిగింది అతని మనస్సులో.

ఆనాడు!

ఎంత మధురమైన రోజు!

కాలేజి అమ్మాయిలకు 'త్రో బాల్' పోటీ జరుగుతోంది. జూఆలజీ డెమానుస్ట్రేటర్ మిస్ హైమావతీ, బాటినీ మేడమ్ నిర్మలాదేవీ యిద్దరూ అమ్మాయిలతో కలసి ఆడుతున్నారు. మా హాస్టలు ముందే ఆ 'త్రో బాల్' కోర్టు. బయటకు వచ్చి ఆట చూస్తున్నాను. హైమావతీ, నిర్మలాదేవీ చెరో టీముకు కెప్టెన్స్‌గా వ్యవహరిస్తున్నారు. కోర్టులోకి దిగారు. మేడమ్ నిర్మలాదేవి 'టాస్' విన్ ఐంది. సర్వీస్ ప్రారంభించింది. ఆ మొదటి బాల్ హైమావతి అందుకోవాలని ప్రయత్నించి బోర్లా పడిపోయింది. అబ్బాయిలంతా ఘొల్లున నవ్వుతున్నారు. హైమావతి అలాగే పడుంది. అమ్మాయిలంతా భయంగా బిత్తర చూపులు చూస్తున్నారు.

అప్పుడు నేను! నేను!! ఒక్క తోపుతో జనాన్ని తోసుకుని కోర్టులోకి దుమికి మేడమ్‌ని పట్టుకుని లేపాను. నా చేతులు ఆవిడను పట్టుకోగానే నా ఒళ్ళు జలదరించింది. జిల్లుమంది. 'షాక్' తిన్నట్లయింది ఆ క్షణంలో. కాని ఆవిడను వదల్లేదు. ఇంతలోనే ఎవరో సోడా తెచ్చారు. ఆవిడ ముఖాన కొద్దిగా చల్లాను. కళ్ళు తెరచింది. సోడా బాటిల్‌ను ఆవిడ చేతికిచ్చాను. మిగిలిన సోడా నీరు గటుక్కున తాగేసింది. ఆవిడకు నా చెయ్యి వూత యిచ్చి లేపాను. నిల్చుంది. థాంక్స్ చెప్పింది నా సహాయానికి. రిసీవ్ చేసుకోకుండా ఆవిడ కళ్ళలోకి చూస్తూండిపోయాను. ఆవిడ కళ్ళు నాకు కృతజ్ఞత చెప్తున్నాయ్! మరల ఆట ప్రారంభమైంది. మొదటి గేమ్ నిర్మలాదేవి టీమ్ 'విన్' ఐంది. రెండో గేమ్ యిరు పక్షాలు పట్టుదలగా ఆడుతున్నాయి. షూర్ 'హాఫ్ బాల్ యీాచ్' లో వుంది. హైమావతి సర్వీస్ చేసింది. ఆవిడది 'స్క్రూ' సర్వీస్. బాల్ రయ్‌మని ఎదుటి కోర్టులోకి వెళ్ళింది. ఆ బాల్‌ను ఎవరూ ఆపలేక

పోయారు. ఇంతలోనే 'రిఫరీ' 'నెట్ బాల్' అంటూ 'విసిల్' వేశాడు.

'నెట్‌కు టచ్ కాలేదంటూ అరచాను. రిఫ్రీ ఒప్పుకోలేదు. 'రిఫరీ. డౌన్! డౌన్!!' అంటూ అరిచేస్తున్నాను ఒక్కడినే. మరో నిముషంలో...మిత్రులంతా కలిశారు. నేను 'రెఫ్రీ' అంటే నా మిత్ర బృందమంతా 'డౌన్! డౌన్!!' అంటున్నారు. ఓ పెద్ద గుంపు తయారైంది. అరుస్తున్నాము. ఆట ఆగిపోయింది. రెఫ్రీ రాజీకి వచ్చాడు. 'రీ సర్వ్' చేపిస్తానన్నాడు. ఒప్పుకున్నాము. మిగత రెండు పాయింట్లూ హైమావతి సర్వీస్‌లోనే వచ్చాయి. హైమావతి పార్టీ గెలిచింది. మూడో గేమ్ ఆఖరిది. ఈ గేమ్‌లో ఎవరు నెగ్గితే వారికే మా కాలేజి 'ఉమెన్స్ త్రో బాల్' ట్రోఫీ దక్కుతుంది. రెండు పక్షాలు సమానంగా పోరాడుతున్నాయ్. హైమావతి పార్టీకి మా పార్టీ అంతా 'ఎంకరేజ్' ఇస్తున్నాం. చివరికి హైమావతి పార్టీయే గెల్చింది.

'మిస్ హైమావతి హిప్‌హిప్' అంటూ అరిచేశాను నా ఆనందాన్ని లోపల అణచుకోలేక.

'మీరు చాలా బాగా ఆడారండీ. అదే మీ గెలుపుకు కారణం.' అంటూ తెగ పొగిడేశాను మాడమ్ మిస్ హైమావతిని.

ఆవిడ అందంగా ఓ నవ్వు నవ్వింది!

నా ఒళ్ళు పులకరించింది!

నేనూ విసిరాను బదులుగా ఓ చిరునవ్వు!

ఆవిడ వెళ్తూ నాకేసి చూసి మరలా నవ్వుతూ—

'థాంక్యూ వెరిమచ్' అంది.

నాకు సిగ్గేసింది. వెంటనే—

'నో మెన్షన్' అన్నాను.

వెనుక ఎక్స్ పార్టీ మేడమ్ నన్ను తెగ తిట్టేస్తుంది. వి విన్నట్లే వూరుకున్నాను ఏంచేసేదిలేక. అది గమనించి హైమావతి నవ్వుతూ'ఇక వస్తా'నని బయలుదేరింది.

ఆమెతో నేనూ నడచాను. బజారుదాకా అలానే వెళ్ళాను. ఆవిడ బస్ స్టాప్‌లో నిల్చుంది. నేను ఆవిడ దగ్గరకెళ్ళి—

'ఏమండీ. మీరు ఏమీ అనుకోకపోతే ఒక చిన్న కోరిక' అన్నాను.

ఏమిటన్నట్లు చూచింది.

'మీరు గెలిచారు. కాబట్టి మీకు ఓ చిన్నసైజు పార్టీ యివ్వాలనుంది. దయచేసి అంగీకరించాలి' అన్నాను.

'ఎందుకండీ అనవసరంగా డబ్బు తగలేసుకోటం ?' అంది.

'అలాకాదు. మీరు తప్పకుండా అంగీకరించాలి' అన్నాను.

కొద్ది సేపు ఆలోచించుకొని చివరకు ఏదో నిర్ణయానికి వచ్చింది.

'ఈ రోజు నేను మీకు పార్టీ యిస్తాను. రేపు మీ పార్టీకి వస్తా' నంది.

నాకాశ్చర్యంగా వుంది మేడమ్ ప్రవర్తన.

'ఆల్ రైట్' అని ఒప్పేసుకున్నాను.

సాయంత్రం ఆరుగంటలకు టిప్ టాప్‌గా తయారయ్యాను. ఒక గంటసేపు సిటీ బస్ స్టాప్‌లో నుంచుని విసిగివేసారి చివరికి రిక్షాలో ఆవిడ యిల్లు చేరాను. సాదరంగా లోనికి ఆహ్వానించింది.

ఇల్లు అందంగా, నాజూగ్గా వుంది. క్రింద మూడు గదులు. పైన ఓగది. పలురకాల రంగులలో అధునాతన పద్ధతిలో నిర్మించిన చిన్నసైజు యిల్లు అది. ముందు హాలులో సోఫాసెట్టు, ఓ ప్రక్కగా చిన్న టేబుల్ మీద పిలిప్స్ రేడియో, నాలుగు గోడలకూ రక రకాల కాలండర్లూ, కిటికీలకూ, ద్వారాలకూ కర్టెన్లు అలంకరించి వున్నాయ్. ఆయింటి అందాన్ని ఆ స్వాదిస్తూ ఐదు నిముషాలు గడిపాను. ఆవిడ లోనికివెళ్ళివచ్చి నన్ను చూసి ఓ చిరునవ్వు నవ్వింది. మొహమాటంగా నేనూ నవ్వేశాను.

'ఇక లేవండి. భోంచేద్దా' మంది.

మౌనంగా లేచి ఆవిడ ననుసరించాను.

ఆనాటినుంచే మేమిద్దరం అత్యంత సన్నిహితంగా వుండే వాళ్లం. నా'బియస్సీ' పరీక్షలు రాశాను. సెకెండ్ క్లాస్‌లో పాసయ్యాను. అతికష్టంమీద 'యెమ్మెస్సీ' సీటువచ్చింది. చేరాను. హాస్టల్లో చేర్దామంటే బలవంతం మీద ఆవిడింట్లోనే నాబస పెట్టించిది. అందమైన ఆ ఇంట్లో మేమిద్దరమే. పరీక్ష ఫస్టు క్లాస్‌లో పాసయ్యాను. రిసర్చి చదవమంది. కాని సీటు రాలేదు. నేను బియస్సీ చదివినకాలేజిలోనే లెక్చరర్ పోస్టు ఖాళీగా

వుంది. అప్లై చేశాను. వచ్చింది. ఉద్యోగంలో జాయిన్ అయ్యాను. హైమావతిగారికి ఉమెన్స్, కాలేజి ప్రిన్సిపాల్ గా ప్రమోషన్ వచ్చింది. ఇప్పటికీ కలిసే వుంటున్నాం. ఒకనాడు—

నాన్నవచ్చాడు. మామకూతురికి వయసు మళ్ళిపోతోందని, లక్షరూపాయలు కట్నంగాయిస్తామంటున్నారని పెళ్ళి త్వరగా జరగాలని అన్నారు.

ఆ విషయం హైమావతితో చెప్పాను.

ఆమె భోరున ఏడ్చింది.

నాకు అయోమయంగా వుంది.

చివరకు నాకూ, మేడమ్ హైమావతికి వివాహం జరిగింది! నాన్న కోపించి తన ఆస్థిలో చిల్లిగవ్వకూడ నాకు దక్కకుండా అంతా అన్న పేరట వ్రాసేసేరు. అయితే మాత్రం ఏం? మాకేంలోటు? నెల తిరిగే సరికి ఎనిమిది వందలు చేతికి వస్తున్నాయ్. కాలం గడచిపోతోంది. జీవితం సుఖంగా సాగుతోంది.

ఒకరోజు!

ఆరోజు బహుచెడ్డరోజు!!

నా జీవితాన్నే తలక్రిందులు చేసిన రోజు!!!

మనశ్శాంతి లేకుండా చేసిన రోజు!!!!

ఆరోజు క్లబ్ కు వెళ్ళి ఆలస్యంగా ఇంటికి వచ్చాను. హైమలేదు. పనిమనిషి కాఫీకప్పు అందించి 'అమ్మగారు స్నేహితురాలింటికి పార్టీకెళ్ళార'ని చెప్పింది. నాకు ఒక్కడికీ ఏమీ పాలుపోక పిక్చరుకెళ్దామని బయల్దేరాను. ఇంగ్లీషు పిక్చరు కెళ్ళాను. నే వెళ్ళేసరికి పిక్చరు బిగినయింది. నాముందు వరుసలో ఒక జంట కూర్చుని కబుర్లాడుతూ తెగనవ్వేస్తున్నారు. ప్రక్క సీట్లో కూర్చున్న ఓ రిటైర్డ్ ఆఫీసర్ ఆ డిస్టర్బ్ భరించలేక వేరే సీట్లోకి మారిపోయాడు.

'ఇంటర్వెల్'లో లైట్లు వెలగాయి. ఆజంట బహుశా 'టీ'లు త్రాగటానికి కాబోలు లేశారు. చూశాను. నా కళ్ళు జిగేలుమన్నాయ్! గుండె ఆగిపోయింది! మనసు మూగవోయింది. మూర్ఛపోబోయే పరిస్థితి ఏర్పడింది. వెంటనే లేచి యింటికి వచ్చేశాను.

నా ముఖంలో ఒక నెత్తురు చుక్క లేదు!

ఆలోచనలు రావటం లేదు. మనస్సు మోడువారి ఆలోచనా శక్తిని కోల్పోయింది కాబోలు.

జీవితం నరకమనిపించింది!

ఎండ్రిన్ త్రాగేద్దామనిపించింది!

అంతలోనే ఆత్మహత్య మహాపాప మనిపించింది!!

నేను నిర్జీవంగా వున్నాను.

ఇంతకీ ఎవడువాడు? హైమావతికి వాడితో ఏమి సంబంధం? ఏమి సంబంధ ముంటుంది? పరాయి మొగాడూ, ఆడదీ కలిసివుంటే ఏమి సంబంధం వుందని లోకం వూహిస్తుందో అదే. తప్పదు.

కాని ఎస్సెల్సీ మూడుసార్లు, పి. యు. సి. రెండు సార్లు ఫెయిలయిన నన్ను వృద్ధిలోకి తీసుకవచ్చి కోరి వివాహమాడిన నా హైమ ఈ పనిచేస్తుందా? ఛ. అబ్సర్డ్. నేను నమ్మలేను. కాని నిదర్శనం ప్రత్యక్షంగా నాకళ్ళతో చూశాను. ఎలా కాదనుకోను?



హైమతో ముభావంగా వుంటున్నాను. విషయం అడిగెయ్యాలనుకున్నాను. కాని ఎలా? ఏమని అడగ్గలను? అడిగితే మగాడి పరువేమిటి? ఆవిడ హృదయంలో నా స్థానం ఏమిటి?

పదిరోజులు గడచాయి.

ఓ రోజు హైమ అర్జెంటుగా ఐదువేలు కావాలంది. ఎందుకని అడిగాను. కారణం చెప్పనంది. కారణం చెప్పకపోతే యివ్వనన్నాను. దాంతో కోపమొచ్చి దూషించింది. ఓర్చుకున్నాను! శృతిమించింది! నా కోపం హద్దులు దాటింది! హైమ చెంప చెళ్ళుమంది! మరల ఏదో అంది! మరో చెంప పగిలింది! మరోమాట ...రెండు చెంపబాకందగడ్డల్లా ఎర్రగా వాచాయి!

హైమ వెంటనే ఆరోజే వాళ్ల పిన్నియింటికి వెళ్ళిపోయింది.

వెళ్ళి తీసుకొస్తామనిపించింది. కాని మనస్సు ఒప్పలేదు. నమ్మిన నాకు ద్రోహంచేసి పరాయివాడితో నవ్వుతూ ఆనందంగా తిరుగుతోంది. వారి జల్సాలకు నేను డబ్బు యివ్వాల్ట. లెక్చరర్ సుధాకర్ భార్య యింకోడితో తిరుగుతుందని తెలిస్తే...ఛీ సిగ్గులేకపోతే సరి!

నెల్నాళ్ళు గడచాయి.

దాని ఫలితమే ఈ రోజు కేసు. విడాకులిప్పించాలని ప్రభుత్వాన్ని కోరకపోతే నన్నడిగితే ఆ స్వేచ్ఛ నేనే యిచ్చేవాడ్నిగా!

కాని, హైమ నా ప్రాణంలో ప్రాణం! శరీరంలో శరీరం! మా యిద్దరి మనస్సులు కొంతకాలం ఒక్కటే ఆవిడను నేనెలా వదులుకోగలను?

ఆలోచించి నిర్ణయానికి వచ్చాను.

వెంటనే ఓ ఉత్తరం వ్రాసి పనిమనిషిచేత హైమాకు పంపాను. ఆ మనిషిచేతే తిరిగి మరో వుత్తరం రాసి పంపింది.

శ్రీ సుధాకర్ గారికి—

మీరు పంపిన వుత్తరం చదివాను. అందులోని విషయాలు నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. నన్ను అంత నీచంగా తలుస్తారని కలలోనైనా వూహించలేదు.

ఆరోజు నాతో పిక్చరుకు వచ్చింది మా పిన్ని కొడుకు రవీంధ్ర. నా స్నేహితురాలింట పార్టీ అయిన తర్వాత బజార్లో రవీంద్ర అన్నయ్య కలిశాడు. అన్నయ్యకు ఈ వూరికి ట్రాన్స్‌ఫర్ అయింది. విషయాలు మాట్లాడుకుంటూ పిక్చరుకెళ్ళాము. మీరు కనీసం నన్నడిగినా నిజం తెలిసేది. కాని మీరలా చేయలేదు.

ఇక డబ్బు విషయం. మీ నాన్నగారు కన్పించి నన్ను నోటికొచ్చినట్లు తిట్టారు. మిమ్మల్ని మాయచేశాననీ, ఎంతో డబ్బుపెట్టి చదివించిన కొడుకుని తనకు కాకుండా చేశాననీ పలురకాలుగా దూషించారు. మీ చదువుకు ఖర్చుచేసిన ఐదు వేలూ యిచ్చెయ్యమని అడిగారు. ఆయన అదో తరహా మనిషిలా వున్నాడు 'డబ్బు సుధాకరానికి తెలవకుండా యివ్వాలమ్మాయ్!' అంటూ పలుమార్లు హెచ్చరించారు. అందువలన నేను కారణం చెప్పటానికి అవకాశంలేకుండాపోయింది. అంతమాత్రంచేత మీరలా పశువులా ప్రవర్తించాలా? మీ అసలు స్వరూపం బయటపడింది మీ అదర్శాలూ, ఆశయాలు ఏమైనాయి?

"హైమావతి,'.

భోరున ఏడ్చేశాను ఆ వుత్తరం చదివి. నన్ను నేనసహ్యించుకున్నాను. నా సంకుచిత తత్వానికి లోలోన ఏడ్చాను. నా హృదయం మండిమసి ఐపోయింది.

'హైమా! నన్ను క్షమించు' అంటూ పరుగెత్తువెళ్ళి నాహృదయరాణి దగ్గర పడిపోయాను. హైమ నన్ను లేపి నా కళ్ళు నీళ్ళు తుడిచింది.


## కథాంజలి

(కథల మాస పత్రిక)

స్థాపితము 1938.

విడి ప్రతి. ... 25 పై. లు

సంవత్సర చందా. ... రూ. 4-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాతమ్స్, మరియు స్వదేశ మిత్ర బుక్ స్టాల్సులలోను దొరుకుతుంది.